# నేడే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు .. విప్ జారీ చేసిన బిజెపి ..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు బుధవారం లోక్‌సభ ముందుకు రాబోతోంది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ బిల్లును ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. మరోవైపు, కాంగ్రెస్ సహా ఇతర ఇండియా కూటమి పార్టీలు ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. ముస్లింల హక్కుల్ని కాలరాసే బిల్లుగా అభివర్ణిస్తున్నాయి. ఈ బిల్లు ద్వారా వక్ఫ్ అపరిమిత అధికారాలను కట్టడి చేస్తామని బీజేపీ చెబుతోంది. ఇదిలా ఉంటే, వక్ఫ్ బిల్లు పార్లమెంట్ ముందుకు వస్తున్న తరుణంలో, బుధవారం ఉదయం రాహుల్ గాంధీ ఇండియా కూటమి నేతలతో సమావేశం కానుంది.

మరోవైపు, ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు చెందిన ఎంపీలంతా రేపు సభకు హాజరు కావాలని ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. దీనికోసం బిజెపి తమ సభ్యులకు విప్ జారీ చేసింది. ఇక వక్ఫ్ బిల్లును అడ్డుకోవడానికి విపక్షాలు వ్యూహాలను రూపొందిస్తున్నాయి. ఇప్పటికే ఎస్పీ, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్, ఎంఐఎం వంటి పార్టీలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. గతేడాది పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో, జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు వక్ఫ్ బిల్లుపై చర్చించారు. దీంట్లో 14 సవరణల్ని ప్రవేశపెట్టారు. రేపు మధ్యాహ్నం లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తుంది. లోక్‌సభలో 8 గంటల పాటు చర్చించనున్నారు. ఆ తర్వాత రాజ్యసభకు పంపనున్నారు.

పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లు పాస్ అవుతుందా.. అనే చర్చ ఇప్పుడు నడుస్తోంది. అయితే, పార్లమెంట్‌లోని రెండు సభల్లో అధికార ఎన్డీయేకే బలం ఉంది. బిల్లు సులువుగా పాస్ అయ్యే అవకాశం కనిపిస్తోంది. లోక్‌సభలో వక్ఫ్ బిల్లుకు 298 మంది ఎంపీల మద్దతు ఉంది, వ్యతిరేకంగా 233 మంది ఉన్నారు. తటస్థంగా 11 మంది ఎంపీలు ఉన్నారు. ఇక రాజ్యసభలో వక్ఫ్ బిల్లుకు అనుకూలంగా 122 మంది ఎన్డీయే సభ్యుల మద్దతు ఉండగా, వ్యతిరేకంగా ఇండి కూటమికి చెందిన 116 మంది ఎంపీలు ఉన్నారు. ఎలా చూసినా, కూడా ప్రతిపక్షాలు వాకౌట్ చేయడం తప్పితే, బిల్లును అడ్డుకునే అవకాశమే కనిపించడం లేదు.

## అప్పటి నుంచి ఇప్పటి వరకూ అవి ప్రభుత్వ భూములే

### –టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

హైదరాబాద్ ఏప్రిల్ 1 (ఎక్స్‌ప్రెస్ న్యూస్ );: కంచె గచ్చిబౌలిలోని భూముల విషయంలో పెద్ద ఎత్తున రభస జరుగుతున్న విషయం తెలిసిందే.

ఈ భూములను పరిరక్షించాలంటూ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. ఈ ఆందోళనకు ప్రతిపక్ష పార్టీల నుంచి మద్దతు లభిస్తుంటే.. ప్రభుత్వం మాత్రం ఆ భూములు తమవేనని అంటోంది. తాజాగా ఈ భూముల విషయంపై టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ స్పందించారు. హెచ్‌సియు భూములకు బదులు ఎప్పుడో ప్రభుత్వ భూములను ఇవ్వడం జరిగిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ అవి ప్రభుత్వ భూములే అని పేర్కొన్నారు. హెచ్‌సియు భూములను ప్రభుత్వం లాక్కోవట్లేదని ఆయన స్పష్టం చేశారు.

# ప్రజలే ఫస్ట్ .. సమానంగా సంక్షేమం, అభివృద్ధి- చంద్రబాబు

**–వారసత్వంగా 10 లక్షల కోట్ల అప్పు**
**–అమరావతికి పూర్వవైభవం తెస్తాం**
**–గాడిలోపడ్డ పోలవరం విశాఖ ఉక్కు**
**–వచ్చే నెలలో తల్లికి వందనం ప్రారంభం**
**–త్వరలోనే మెగా డీఎస్సీ నిర్వహిస్తాం**
**–మే. జూన్ నెలల్లో మత్స్యకారులకు 20వేలు ఇస్తాం**
**–కొత్త గొల్లపాలెంలో పింఛన్లు అందజేసిన సీఎం చంద్రబాబు**



అమరావతి, ఏప్రిల్ 1: సంక్షేమం అభివృద్ధి సమానంగా నిర్వహించి, వనరులను వినియోగించి సంపద సృష్టించి, పేదలకు ఖర్చుపెట్టి పేదరికం లేని సమాజాన్ని సృష్టించడమే తన జీవిత ఆశయమని సీఎం చంద్రబాబు అన్నారు. బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం కొత్త గొల్లపాలెం గ్రామంలో మంగళవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందించారు. అనంతరం ప్రజా వేదిక కార్యక్రమంలో ప్రసంగించారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత ఇప్పటి వరకు కొత్త గొల్లపాలెం గ్రామానికి ముఖ్యమంత్రి హోదాలో ఏ రాజకీయ పార్టీ నాయకుడు రాలేదని, చిన్నగంజాం మండలానికి మూడోసారి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు విచ్చేశారని ఎమ్మెల్యే సాంబశివరావు కొనియాడారు. బాపట్ల కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ.. గ్రామంలో 996 మంది జనాభా ఉంటే 304 గృహాలు ఉన్నాయని 108 మందికి ప్రతినెల 68వేల రూపాయలు పింఛన్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. వారసత్వంగా తనకు అప్పు వచ్చిందని, ప్రస్తుతం ఆ అప్పు ?10 లక్షల కోట్లని స్పష్టం చేశారు. అప్పులకు వడ్డీలు చెల్లించే బాధ్యత కూడా తనపై ఉందన్నారు. అయినా సంక్షేమం, అభివృద్ధి సమానంగా చేస్తామన్నారు.

### పేదరికం లేని సమాజమే లక్ష్యం

"ఏప్రిల్ నుంచే పెంచిన పింఛన్లను లెక్కకట్టి అమలు చేస్తున్నాం, దివ్యాంగులకు 6 వేల పింఛన్లు ఇస్తున్నాం. కోటిన్నర కుటుంబాలకు గానూ 64 లక్షల మందికి పింఛన్లు అందజేస్తున్నాం. కొందరికి సంపాదించే దానికంటే ఎక్కువ ఆదాయం వస్తోంది. పింఛన్ల పంపిణీ కోసం ఏడాదికి ?33,100 కోట్లు ఖర్చవుతోంది. ఒకప్పుడు నొక్కిన బటన్లన్నీ నేను ఇచ్చే పింఛన్లతో సమానం. పింఛన్ల రూపంలో నెలకు -2,722 కోట్లు ఖర్చు చేస్తున్నాం. గతంలో ఒక నెల పింఛన్ తీసుకోకపోతే ఆ డబ్బు వచ్చే పరిస్థితి లేదు. ఒక నెల తీసుకోకపోతే.. రెండు లేదా మూడో నెల తీసుకునే అవకాశం ఇచ్చాం. రెండు నెలలు పింఛన్లు తీసుకోని లబ్ధిదారులు 93,300 మంది ఉన్నారు. మిగుల్చుకోవాలంటే నెలకు -76 కోట్లు ప్రభుత్వానికి మిగులుతుంది. పేదలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో అదనంగా-76 కోట్లు ఇస్తున్నాం. పేదరికం లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని సీఎం చంద్రబాబు అన్నారు.

### వచ్చే నెలలో తల్లికి వందనం..

తల్లికి వందనం మేలో ఇస్తామని, ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం మంజూరు చేస్తామని సీఎం అన్నారు. ఇక నుంచి నాలుగు నెలలకి ఒకసారి ఉచితంగా గ్యాస్ సిలిండర్ ఇస్తాం.. రైతుల పంటలకు గిట్టుబాటు ధర ఇస్తాం.. మే, జూన్ లో వేట నిషేధ సమయంలో మత్స్యకారులకి 20 వేలు ఇస్తామని వెల్లడించారు. ఉద్యోగులు ప్రజా సేవలో బాగా పని చేస్తున్నారు అని సీఎం ప్రశంసలు కురిపించారు. ఇక, మనకంటే ధనికమైన రాష్ట్రం తెలంగాణలో మనకంటే తక్కువ పింఛన్ ఉందన్నారు.. తాను ఏం సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నానో వివర్శించే వాళ్లు కళ్లుండి చూడాలన్నారు.

### అమరావతిని గాడిలో పెట్టాం

అమరావతి రాజధాని ని గాడిలో పెట్టాం.. 3,4 సంవత్సరాల్లో అమరావతి కి పూర్వ వైభవాన్ని తీసుకువస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. 2027కి పోలవరం పూర్తి చేసి నదులు అనుసంధానం చేస్తామని స్పష్టం చేశారు.. విశాఖ ఉక్కుని దివాళా తీయించారని ఫైర్ అయ్యారు.. కానీ, విశాఖ ఉక్కుకి 11 వేల కోట్లు నిధులు తీసుకువచ్చాం.. విశాఖ స్టీల్ కూడా గాడిలో పడింది.. విశాఖ కి రైల్వే జోన్ కూడా వచ్చిందన్నారు.. గతంలో రోడ్లు గుంతల మయంగా మారాయి.. హాస్పిటల్ కి వెళ్ళాలంటే రోడ్డుపైనే డెలివరీ అయ్యే పరిస్థితి ఉండేదన్నారు.. ఇక, ఈ నెలలోనే డీఎస్సీ పూర్తి చేసి స్కూల్స్ ప్రారంభం అయ్యే నాటికి కొత్త టీచర్లను నియమిస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

### కళ్లున్న వాళ్లకే తెలుస్తుంది

సంక్షేమం ఇవ్వలేదనే వాళ్లు కళ్ళు ఉంటే చూడాలి. మనసుంటే మాట్లాడాలి అన్నారు చంద్రబాబు. మీ దగ్గరకు ఎవరైనా వచ్చి అడిగితే మనం ఇచ్చే పింఛన్ల సంగతి చెప్పండి.. అన్నా క్యాంటీన్ల ద్వారా పేదలకు భోజనం అందిస్తున్నాం.. అమరావతి రాజధాని వస్తే మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి.. అమరావతిని మరో మూడేళ్లలో గాడికి పెడతాం.. అమరావతికి పూర్వవైభవం తెస్తాం.. నదుల అనుసంధానం చేయాలని పోలవరాన్ని గాడిలో పెడుతున్నాం.. వ్యవసాయం సజావుగా సాగుతుందన్నారు.. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అని పోరాడాం.. జనసేన, బీజేపీ నేతలతో కలసి మాట్లాడాం.. విశాఖ స్టీల్ కూడా గాడిలో పడింది.. ఇలా పరిపాలన సమర్థవంతంగా చేస్తే ఏదైనా సాధ్యం అవుతుంది.. విశాఖ రైల్వే జోన్ వచ్చింది.. రోడ్లు మొత్తం బాగుచేసాం.. భవిష్యత్తులో రోడ్లు అద్దంలా చేస్తాం.. పిల్లల ఉద్యోగాల కోసం మెగా డీఎస్సీ.. స్కూల్ ఓపెన్ అయ్యే లోపు కొత్త టీచర్లను విధుల్లోకి తీసుకుంటాం.. చేనేత కార్మికులు, వడ్డెర, మత్స్యకారులు, నాయీ బ్రాహ్మణులు కోసం ఏం చేస్తే జీవితాలు బాగుపడతాయో ఆలోచన చేస్తున్నామని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు.

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సంపన్నం చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు వీడియో-కాన్ఫరెన్సింగ్ ద్వారా వ్యవసాయం మరియు గ్రామీణ శ్రేయస్సుపై బడ్జెట్ అనంతర వెబ్‌నార్‌లో ప్రసంగించారు. బడ్జెట్ అనంతర వెబ్‌నార్‌లో పాల్గొనడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, ఈ సంవత్సరం బడ్జెట్ ప్రభుత్వ మూడవ పదవీకాలంలో మొదటి పూర్తి బడ్జెట్ అని, విధానాలలో కొనసాగింపును మరియు విక్షిత్ భారత్ దార్శనికత యొక్క కొత్త విస్తరణను ప్రదర్శిస్తుందని ప్రధానమంత్రి నొక్కి చెప్పారు. బడ్జెట్‌కు ముందు అన్ని వాటాదారుల నుండి విలువైన ఇన్‌పుట్‌లు మరియు సూచనలను ఆయన అంగీకరించారు, అవి చాలా సహాయకారిగా ఉన్నాయి. ఈ బడ్జెట్‌ను మరింత ప్రభావవంతంగా మార్చడంలో వాటాదారుల పాత్ర మరింత కీలకంగా మారిందని ఆయన నొక్కి చెప్పారు.

"విక్షిత్ భారత్ లక్ష్యం పట్ల మా సంకల్పం చాలా స్పష్టంగా ఉంది మరియు రైతులు సంపన్నులు మరియు సాధికారత కలిగిన భారతదేశాన్ని మేము కలిసి నిర్మిస్తున్నాము" అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు మరియు ఏ రైతు కూడా వెనుకబడిపోకుండా చూసుకోవడానికి మరియు ప్రతి రైతును ముందుకు తీసుకెళ్లడానికి ఈ ప్రయత్నం జరుగుతుందని నొక్కి చెప్పారు. వ్యవసాయం అభివృద్ధికి మొదటి ఇంజిన్‌గా పరిగణించబడుతుందని, ఇది రైతులకు గర్వకారణంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. "భారతదేశం ఏకకాలంలో రెండు ప్రధాన లక్ష్యాల కోసం పనిచేస్తోంది: వ్యవసాయ రంగం అభివృద్ధి మరియు గ్రామాల శ్రేయస్సు" అని ఆయన పేర్కొన్నారు.

ఆరు సంవత్సరాల క్రితం అమలు చేయబడిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన ద్వారా రైతులకు దాదాపు -3.75 లక్షల కోట్లు అందించబడిందని, ఈ మొత్తాన్ని 11 కోట్ల మంది రైతుల ఖాతాలకు నేరుగా బదిలీ చేశామని శ్రీ మోదీ నొక్కి చెప్పారు. ?6,000 వార్షిక ఆర్థిక సహాయం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తోందని ఆయన నొక్కి చెప్పారు. ఈ పథకం యొక్క ప్రయోజనాలు దేశవ్యాప్తంగా రైతులకు చేరేలా రైతు కేంద్రీకృత డిజిటల్ మౌలిక సదుపాయాలను సృష్టించడం జరిగిందని, మధ్యవర్తులు లేదా లీకేజీలకు అవకాశం లేదని ఆయన పేర్కొన్నారు. నిపుణులు మరియు దార్శనిక వ్యక్తుల మద్దతుతో ఇటువంటి పథకాల విజయం సాధ్యమని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. వారి సహకారాన్ని ఆయన ప్రశంసించారు, వారి సహాయంతో ఏదైనా పథకాన్ని పూర్తి బలంతో మరియు పారదర్శకతతో అమలు చేయవచ్చని పేర్కొన్నారు. వారి కృషికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు మరియు ఈ సంవత్సరం బడ్జెట్‌లో చేసిన ప్రకటనలను అమలు చేయడానికి ప్రభుత్వం ఇప్పుడు వేగంగా పనిచేస్తోందని, వారి నిరంతర సహకారాన్ని కోరుతున్నారని పేర్కొన్నారు.

భారతదేశ వ్యవసాయ ఉత్పత్తి రికార్డు స్థాయికి చేరుకుందని ప్రధానమంత్రి నొక్కి చెబుతూ, 10-11 సంవత్సరాల క్రితం వ్యవసాయ ఉత్పత్తి దాదాపు 265 మిలియన్ టన్నులు ఉండేదని, అది ఇప్పుడు 330 మిలియన్ టన్నులకు పెరిగిందని అన్నారు. అదేవిధంగా, ఉద్యానవన ఉత్పత్తి 350 మిలియన్ టన్నులను దాటింది. విత్తనం నుండి మార్కెట్ వరకు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం, వ్యవసాయ సంస్కరణలు, రైతు సాధికారత మరియు బలమైన విలువ గొలుసు ఈ విజయానికి కారణమని ఆయన అన్నారు. దేశ వ్యవసాయ సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకుని, ఇంకా పెద్ద లక్ష్యాలను సాధించాల్సిన అవసరాన్ని శ్రీ మోదీ నొక్కి చెప్పారు. ఈ దిశలో, బడ్జెట్‌లో అతి తక్కువ ఉత్పాదకత కలిగిన 100 వ్యవసాయ జిల్లాల అభివృద్ధిపై దృష్టి సారించి ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజనను ప్రకటించారని ఆయన అన్నారు.

వివిధ అభివృద్ధి పారామితులపై ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ కార్యక్రమం నుండి కనిపించే సానుకూల ఫలితాలను ప్రధానమంత్రి ప్రస్తావించారు, ఇవి సహకారం, ఏకాగ్రత మరియు ఆరోగ్యకరమైన పోటీ నుండి ప్రయోజనం పొందుతాయి. ఈ జిల్లాల నుండి వచ్చే ఫలితాలను అధ్యయనం చేసి, నేర్చుకున్న విషయాలను వర్తింపజేయాలని ఆయన ప్రతి ఒక్కరినీ కోరారు, ఈ 100 జిల్లాల్లో రైతుల ఆదాయాన్ని పెంచడానికి ఇది సహాయపడుతుంది.

ఇటీవలి సంవత్సరాలలో చేసిన ప్రయత్నాలు దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచాయని, అయితే, దేశీయ వినియోగంలో 20 శాతం ఇప్పటికీ దిగుమతులపై ఆధారపడి ఉందని, దీనివల్ల పప్పుధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల అవసరమని ప్రధానమంత్రి నొక్కి చెప్పారు. భారతదేశం శనగలు మరియు పెసలలో స్వయం సమృద్ధిని సాధించినప్పటికీ, కంది, మినుములు మరియు కాయధాన్యాల ఉత్పత్తిని వేగవంతం చేయవలసిన అవసరం ఉందని ఇక్కడ గుర్తించారు. పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచడానికి, అధునాతన విత్తనాల సరఫరాను నిర్వహించడం మరియు హైబ్రిడ్ రకాలను ప్రోత్సహించడం చాలా అవసరమని, వాతావరణ మార్పు, మార్కెట్ అనిశ్చితి మరియు ధరల హెచ్చుతగ్గులు వంటి సవాళ్లను పరిష్కరించడంపై దృష్టి పెట్టవలసిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.

# రేషన్ బియ్యం దోపిడీకి అడ్డుకట్ట.. ఎమ్మెల్యే గండ్ర



వరంగల్, ఏప్రిల్ 1 గత ప్రభుత్వంలో నిరుపేదలకు రేషన్ షాపుల ద్వారా దొడ్డు బియ్యం సరఫరా చేశారని, కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం రేషన్ దోపిడీ మాఫియాకు అడ్డుకట్ట వేసి, నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం జయశంకర్ జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని వెంకట్రావు పల్లి (సి) రెండవ రేషన్ షాప్ లో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే జీఎస్సార్ ప్రారంభించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ? ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ నిరుపేద కుటుంబానికి సన్నబియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజా ప్రభుత్వంలో పేద కుటుంబాలందరికీ సన్నబియ్యం పంపిణీ చేయాలని, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, రేషన్ కార్డులోని ఒక్కో కుటుంబ సభ్యునికి, ఆరు కిలోల చొప్పున సన్నబియ్యంను అందించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ సంవత్సరంన్నర కాలంలో సీఎం రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసి చూపెట్టారని ఎమ్మెల్యే అన్నారు. గతంలో రేషన్ బియ్యం పంపిణీ మాఫియాలు ఉండేవని, ఇప్పుడు వాటిని శాశ్వతంగా నిర్మూలించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై డిసీఎస్ ఓ శ్రీనాథ్, జిల్లా మేనేజర్ రాములు, ఏసిఎస్ఓ వేణుగోపాల్, తహశీల్దార్ నల్లబెల్లి హేమ, సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ భాస్కర్ల రాజు, మార్కెట్ డైరెక్టర్ లక్ష్మి, రేషన్ డీలర్ బుర్ర సదయ్య, కాంగ్రెస్ జిల్లా, మండల, నాయకులు గూట్ల తిరుపతి, ముకిరాల మధువంశీకృష్ణ, కామిడీ రత్నాకర్ రెడ్డి, దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయ కోమురు, గడ్డం కొమురయ్య, దబ్బేట అనిల్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, బుర్ర లక్ష్మణ్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు, రేషన్ డీలర్లు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి




మహబూబాబాద్, ఏప్రిల్ 1 (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత సన్న బియ్యం పథకంను పెద్దవంగర మండలంలోని చిన్నవంగర గ్రామంలో పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ప్రారంభించి,లబ్ధిదారులకు స్వయంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాన్య ప్రజలకు ఆర్థిక భారం తగ్గించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

ఉచిత సన్న బియ్యం పథకం ద్వారా అర్హత గల ప్రతి కుటుంబం నాణ్యమైన బియ్యాన్ని ఉచితంగా పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది..మీ అందరి సహకారంతో ఈ కార్యక్రమాన్ని సజావుగా అమలు చేస్తామని,అలాగే బియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రతి లబ్ధిదారునికి అందేలా అధికారులను కఠినంగా పర్యవేక్షించమని కోరుతున్నానని అన్నారు.అనంతరం ఎమ్మెల్యే గ్రామ ప్రజలతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో పెద్దవంగర మండల పార్టీ అధ్యక్షులు ముద్దసాని సురేష్, ఉపాధ్యక్షులు రంగు మురళి, నాయకులు భానోత్ గోపాల్, పాకనాటి రామకృష్ణారెడ్డి, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు,నాయకులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి గతిశక్తి ఆధ్వర్యంలోని నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ 88వ సమావేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: రహదారి, రైల్వే, సమాచార సాంకేతికత మరియు మెట్రో రంగాలలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను మూల్యాంకనం చేయడానికి పరిశ్రమ మరియు అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం జాయింట్ సెక్రటరీ శ్రీ ఇ. శ్రీనివాస్ అధ్యక్షతన ఈరోజు జరిగిన నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ యొక్క 88వ సమావేశం. ఖఓ గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ తో సమలేఖనంలో మల్టీమోడల్ కనెక్టివిటీ మరియు లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని పెంచడంపై ఈ సమావేశం దృష్టి సారించింది.పిఎం గతిశక్తి సూత్రాలకు అనుగుణంగా ఇంటిగ్రేటెడ్ మల్టీమోడల్ మౌలిక సదుపాయాలు, ఆర్థిక మరియు సామాజిక నోడ్‌లకు చివరి మైలు కనెక్టివిటీ మరియు ఇంటర్‌మోడల్ సమన్వయానికి అనుగుణంగా పదకొండు ప్రాజెక్టులను (7- రోడ్, 2- రైల్వే, 1- ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు 1- మెట్రో) ఎన్‌పిజి మూల్యాంకనం చేసింది. ఈ చొరవ లు లాజిస్టికల్ సామర్థ్యాన్ని పెంచుతా యని, ప్రయాణ సమయాన్ని తగ్గిస్తా యని మరియు ప్రాంతాల అంతటా గణనీయమైన సామాజిక-ఆర్థిక ప్రయోజనాలను అందిస్తాయని భావి స్తున్నారు. ఈ ప్రాజెక్టుల మూల్యా ంకనం మరియు అంచనా వేసిన ప్రభావాలు క్రింద వివరించబడ్డాయి.కిషన్‌గంజ్-బహదూర్‌గంజ్ రోడ్ ప్రాజెక్ట్ నుండి 4-లేన్ ఔఊ అనేది బీహార్‌లోని కిషన్‌గంజ్‌లో 23.649 కి.మీ పొడవు గల గ్రీన్‌ఫీల్డ్ అభివృద్ధి. ఈ రహదారి ఎన్‌హెచ్-27 మరియు ఎన్‌హెచ్-327 లను కలుపుతు ంది, ఇది ప్రాంతీయ చలనశీలతను మెరుగుపరుస్తుంది, రద్దీని తగ్గిస్తుంది మరియు బీహార్ మరియు పశ్చిమ బెంగాల్ మధ్య వాణిజ్య కనెక్టివిటీని పెంచుతుంది. ఈ ప్రాజెక్ట్‌లో ఫ్లైఓవర్లు, ప్రధాన వంతెనలు, సర్వీస్ రోడ్లు మరియు అండర్ పాస్‌లు ఉన్నాయి, ఇవి వాహనాల సజావుగా కదలిక మరియు మెరుగైన ప్రాప్యతను నిర్ధారించడానికి సహాయపడతాయి. సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ గ్రామం (ఎన్‌హెచ్-65లో) నుండి చౌటుప్పల్ (ఎన్‌హెచ్-65లో) వరకు గ్రీన్‌ఫీల్డ్ రీజినల్ ఎక్స్‌ప్రెస్‌వే హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ ఎక్స్‌ప్రెస్‌వే యొక్క ఉత్తర భాగం భరత్‌మాల పరియోజన కింద గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్ట్. సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ గ్రామం (ఔఊ-65 పై) నుండి యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ (ఔఊ-65 పై) వరకు తెలంగాణలోని సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట మరియు యాదాద్రి భువనగిరి జిల్లాల గుండా వెళ్ళే 158.64 కి.మీ పొడవైన 4-లేన్ల యాక్సెస్-కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేను అభివృద్ధి చేయడం దీని లక్ష్యం.

# అందరి కృషితోనే జిల్లా సహకార అభివృద్ధికి బాటలు

### –డీసీసీబీ అధ్యక్షులు కుంట రమేష్ రెడ్డి, సీఈఓ వందే నాగభూషణం





నిజామాబాద్, ఏప్రిల్ 1 బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది అందరి కృషితోనే జిల్లా సహకార అభివృద్ధి బాటలు వేసి లాభాల బాటలు తీసుకువచ్చారని డీసీసీబీ అధ్యక్షులు కుంట రమేష్ రెడ్డి, సీఈఓ వందే నాగభూషణం అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం బ్యాంకును లాభాల బాటలో తీసుకువచ్చి అభివృద్ధికి కృషి చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఖలీల్ వాడిలో గల జిల్లా సహకార బ్యాంకు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి డీసీసీబీ అధ్యక్షులు కుంట రమేష్ రెడ్డి, సీఈఓ వందే నాగ భూషణం, మార్క్ ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.

2024-25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు వ్యాపార కార్యకలాపాల్లో రికార్డు స్థాయిలో ఎన్పీఏ సుమారు రూ.63 కోట్లు రికవరీ చేస్తూ రూ.27 కోట్లు లాభాలు తీసుకువచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 14శాతంగా ఉన్న ఎన్పీఏ 7.82 శాతంనకు తగ్గించారు. ఇంత గొప్ప విజయం సాధించిన శుభపరిణామాన్ని పురస్కరించుకొని బ్యాంకు ఉద్యోగులు, సిబ్బందితో కలిసి అధ్యక్షులు కుంట రమేష్ రెడ్డి కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ లక్ష్యం చేరుకున్నందుకు ప్రతీ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీబీ అధ్యక్షులు కుంట రమేష్ రెడ్డి మాట్లాడుతూ? బ్యాంకు బాగుంటే మనం బాగుంటామని, భవిష్యత్ బాగుంటుందని పునరుద్ఘాటించారు. ఈ విజయంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై కృషి చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు నల్ల చంద్రశేఖర్ రెడ్డి, డైరెక్టర్ లింగన్న, బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి దాతల విరాళం అభినందనీయం: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదరాబాద్, ఏప్రిల్ 1: కూకట్‌పల్లి రామాలయంలో గరుడ స్వామి, ఆంజనేయస్వామి విగ్రహాల ఏర్పాటుకు విరాళాన్ని అందజేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. దేవాలయంలో విగ్రహాల ఏర్పాటు కోసం స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ రూ.2 లక్షల విరాళాన్ని ఇవాళ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణారావుకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ? కూకట్‌పల్లిలో 400 ఏళ్ల చరిత్ర కలిగిన రామాలయాన్ని అద్భుతంగా పునర్ నిర్మించడం జరిగిందన్నారు. దేవాలయ ప్రాంగణంలో 27 అడుగుల గరుడ స్వామి, ఆంజనేయస్వామి విగ్రహాల ఏర్పాటులో భాగంగా నిర్మాణ పనులకు సంబంధించి భూమి పూజ చేసినట్లు తెలిపారు. ఈ పనుల కోసం దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేయడం సంతోషకరమన్నారు.

# హస్తినకు చేరిన హెచ్ సి యు భూముల పంచాయితి

-కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిని కలిసిన బీజేపీ ఎంపీలు.
-కంచె గచ్చిబౌలి భూములను రక్షించాలని వినతి
-భూముల విషయంలో జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి
-మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌కు పరిస్థితి వివరించిన బిజెపి ఎంపీలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ భూముల పంచాయితి తాజాగా డిల్లీకి చేరింది. నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో కంచె గచ్చిబౌలి భూములపై కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ను కేంద్ర మంత్రి బండి సంజయ్, తెలంగాణ బీజేపీ ఎంపీలు కలిశారు. కంచె గచ్చిబౌలి భూముల విషయంలో జోక్యం చేసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు.

పర్యావరణ, హెరిటేజ్ భూములను రక్షించాలని కోరారు. హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ సమతుల్యతకు కంచె గచ్చిబౌలి భూములు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. 700 రకాల ఔషధ మొక్కలు, 220 రకాల పక్షులతో ఆ ప్రాంతమంతా ఆర్త నాదాలో అల్లారుతోందన్నారు. ఈ భూములను రియల్ ఎస్టేట్ గా మార్చి వేల కోట్లు దండుకోవాలని ప్రభుత్వం చూస్తోందని బీజేపీ ఎంపీలు కేంద్ర మంత్రికి వివరించారు. హెచ్ సీయూ విద్యార్థులతోపాటు యావత్ హైదరాబాద్ ప్రజలంతా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారని.. తక్షణమే గచ్చిబౌలి భూముల విషయంలో జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ భేటీలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, నగేశ్ కూడా ఉన్నారు.

# ఆ భూమిని గతంలో ఐఎంజి సంస్థకు చంద్రబాబు నాయుడు కేటాయించారు

-ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ ఏప్రిల్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: గతంలో ఐఎంజి సంస్థకు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ భూమిని కేటాయించారని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. హెచ్‌సియు దగ్గర ఉన్న 800 ఎకరాలు ప్రభుత్వ భూమి అని తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ ఆర్ సర్కార్ ఆ భూములను వెనక్కి తీసుకుందని, 19 ఏళ్లుగా భూములు వివాదంలో ఉండడంతో చెట్లు పెరిగాయని చామల స్పష్టం చేశారు. అటవీ భూములంటూ తప్పుదారి పట్టిస్తున్నారని, బిఆర్ఎస్, బిజెపి తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. బిజెపి, బిఆర్ఎస్ నాయకులు విద్యార్థులను రెచ్చగొడుతున్నారని చామల మండిపడారు. హెచ్?సియు భూములను అమ్మవద్దని విద్యార్థుల సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఇవాళ యూనివర్సిటీ బంద్ కు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. బిజెవై ఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్?సీయూ ముట్టడికి వస్తారనే సమాచారంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. యూనివర్సిటీ పరిసరాల్లోకి ఎవరినీ పోలీసులు రానివ్వడంలేదు. యూనివర్సిటీ భూములను పరిశీలించేందుకు వస్తున్న బిజెపి ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్ట్ చేశారు. హెచ్?సియు వద్ద భారీగా పోలీసుల మోహరించారు.

# యువత సేవా కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం : డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి





నల్గొండ, ఏప్రిల్ 1: యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మునుగోడు మండల కేంద్రంలో అశ్వసేన యూత్, పాల్వాయి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

యువత మంచి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తూ మరెందరికో మార్గదర్శకం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీవనపల్లి సైదులు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పేరుతో విధ్వంసం వద్దు

-వర్సిటీ భూముల్లో అటవీ ప్రాంతం
-చెరువులు, కుంటలతో నీటి లభ్యత
-వన్య ప్రాణులకు నెలవుతుగా హెచ్‌సీయూ
-వనాలను నరికేసి నవ నాగరికత తెస్తారా..
-అటవిక చర్యలు వద్దంటున్న విద్యార్థులు
-700కు పైగా పూలజాతి మొక్కలు
-200కు పైగా పక్షి జాతుల నిలయం
-15 జాతుల సరీసృపాలున్నయ్
-10 జాతుల క్షీరదాలు కనిపించకుండా పోయే ప్రమాదం
-హరితవనం కాస్త.. కాంక్రిట్ జంగిల్‌గా మారిపోతుంది
-ప్రభుత్వం తీరుపై స్టూడెంట్స్ తిరుగుబాటు
-యూనివర్సిటీ భూముల్లో జీవ వైవిధ్యాన్ని కాపాడాలి

హైదరాబాద్, ఏప్రిల్ 1: కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని ప్రైవేటు సంస్థలకు వేలం వేయాలని టీజీఐఐసీ రంగం సిద్ధం చేసింది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఈ వేలం ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఆందోళన బాటపట్టారు. ఈ భూమి తమదేనని ఇటు తెలంగాణ సర్కారు.. అటు కేంద్రీయ విశ్వవిద్యాలయం అధికారులు వాదనలకు దిగారు. ఈ లోపులోనే రాత్రి పగలు తేడా లేకుండా దాదాపు వందలాది ఎక్స్‌కవేటర్లతో ఆ భూములను చదును చేసే ప్రక్రియను సర్కారు ముమ్మరం చేసింది.

50 ఎకరాల్లో చెట్లు, పుట్టల తొలగింపు..

చెట్లను తొలగించే పనిలోభాగంగా వందలాది బుల్డోజర్లను ప్రభుత్వం దించింది. ఇప్పటికే 50 ఎకరాల్లో తుప్పలు.. మొక్కల్ని తుంచేసింది. ఈ ప్రక్రియపై విద్యార్థులు ఆందోళనబాట పట్టారు. ఇక బీఆర్ఎస్, బీజేపీ రంగంలోకి దిగాయి. వర్సిటీకి, విద్యార్థులకు మద్దతు పలికాయి. వేలాన్ని ప్రభుత్వం వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే, ఆ భూములు ప్రభుత్వానివేనంటూ టీజీఐఐసీ ఆధారాలను బయటపెట్టింది. ఈ భూములను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి హెచ్‌సీయూ స్వాధీనం చేసిందని, దానికి బదులుగా వర్సిటీకి సర్కారు 397 ఎకరాలను బదలాయించిందని స్పష్టం చేసింది. దీనిపై అప్పటి వర్సిటీ రిజిస్ట్రార్ సంతకం చేశారని తెలిపింది. సంబంధిత కాపీలను ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) విడుదల చేసింది. అయితే.. కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని టీజీఐఐసీ చేసిన ప్రకటనను హెచ్‌సీయూ రిజిస్ట్రార్ ఖండించారు. దీంతో ఇప్పుడు ఈ అంశం చర్చనీయంగా మారింది.

## ఇదొక అభయారణ్యం

ఇప్పటికే అభివృద్ధిలో భాగనగరం విశ్వనగరి దిశలో దూసుకుపోతోంది. కాంక్రీట్ వనాలు విస్తరిస్తున్నాయి. పచ్చదనం కడసారి చూపునూ నోచుకోలేని దైన్య స్థితి చేరింది. పదేళ్ల కింద నాటిన హరితహారం మొక్కల్లో కొన్ని పెరిగితే.. ఇంకొన్ని రాలిపోయాయి. ఇక.. సున్నిత పర్యావరణ ప్రాంతాల్లో కీలకంగా మారింది హైదరాబాద్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఒక భాగం.. కాగా వాణిజ్య అభివృద్ధి పేరిట ఈ భూములపై బుల్డోజర్ దాడి జరుగుతోంది. కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని వేలం వేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కేంద్రీయ విశ్వవిద్యాలయం పరిధిలో పర్యావరణ సమతుల్యతకు ముప్పు తప్పని స్థితి ఏర్పడిందని, హైదరాబాదీ ఊపిరితిత్తులు శల్యం కావటం తథ్యమని పర్యావరణ ప్రేమికులు గగ్గోలు పెడుతున్నారు. అనేక పక్షి జాతులు, క్షీరదాలు, ఔషధ మొక్కలకు ఈ 2,324 ఎకరాల విస్తీర్ణం ఓ అభయారణ్యంగా ఉందని చెబుతున్నారు.

## జీవ వైవిధ్యానికి ఆలవాలం..

విశ్వవిద్యాలయ పరిశోధకుల సమాచారం మేరకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్ లో 700కు పైగా పుష్పించే మొక్కలు, 10 జాతుల క్షీరదాలు, 15 జాతుల సరీసృపాలు, 200కు పైగా పక్షి జాతులకు నిలయం. అంతేకాకుండా వంద కోట్ల ఏళ్ల నాటి రాతి నిర్మాణాలు కూడా ఉన్నాయి. సాధారణంగా కనిపించే క్షీరదాలలో మచ్చల జింకలు, అడవి పందులు, ముళ్లపందులు, కుందేళ్లు ఉన్నాయి. వేటతో పాంగోలిన్లు ఇప్పటికే అదృశ్యమయ్యాయి. సరీసృపాలలో, రస్సెల్స్ వైపర్, కోబ్రా, ఇండియన్ రాక్ పైథాన్, ఇండియన్ క్రైట్స్, మానిటర్ బల్లి ఇంకా క్యాంపస్‌లోనే ఉన్నాయి. ఇక విశ్వవిద్యాలయ జీవ వైవిధ్యంలో 200కు పైగా పక్షి జాతులు ఉన్నాయి, వాటిలో చాలా వలస పక్షులు అంతరించిపోతున్నాయి, వీటిలో రాబందులు, గద్దలు , కొంగలు, కార్మోరెంట్స్, హెరాన్లు, ఐబిస్, ఫ్లెమింగోలు, ఇండియన్ పిట్ట , పెలికాన్లు ఉన్నాయి. హిమాలయాల నుంచి వలస వచ్చే అరుదైన పక్షి వెర్డిటర్ ఫ్లైక్యాచర్‌ను ఈ క్యాంపస్‌లో పక్షుల పరిశీలకులు, వన్యప్రాణుల ఔత్సాహికులు గుర్తించారు. ప్రధానంగా రెండు నీటి వనరులు నెమలి సరస్సు, గేదెల సరస్సుతో పాటు వన్యప్రాణులకు దాహార్తి తీర్చే మరో మూడు చెరువులపై ఇప్పుడు బుల్డోజర్ కరాళ నృత్యం చేయడం పర్యావరణానికి ముప్పుగా మారనుంది.

## అద్భుత ఔషధాల చిరునామా..

వర్సిటీ ప్రాంతంలోని వనాల్లో అనేక ఔషధ, సుగంధ మొక్కలు పరిశోధకులు, శాస్త్రవేత్తలకు ప్రధాన ఆధారం. ప్రత్యేక ఆసక్తికి కీలకం. అలాంగియం సాల్విఫోలియం (బీపీని తగ్గించే లక్షణాలను కలిగి పేగుల పెరిస్టాల్టిక్ కదలికను పెంచుతుంది), ఆండ్రోగ్రాఫిస్ పానికులాటా నీస్ (కాలేయాన్ని సరిదిద్దడంలో రక్షించడంలో సమర్థవంత ఆయుర్వేద వైద్యం) ఇవి కాకుండా విశ్వవిద్యాలయంలో అనేక ఔషధ మొక్కలు న్నాయి. ఈ క్యాంపస్ ఒక పురాతన శిలా నిర్మాణం మష్రూమ్ రాక్ కు నిలయంగా ఉంది, ఇది దక్కన్ భౌగోళిక చరిత్రకు చిహ్నంగా ఉద్భవించింది. ఈ క్యాంపస్‌లోని జంతుజాలాన్ని పరిశీలిద్దాం, నెమలి, మచ్చల జింక, నక్షత్ర తాబేలు. ఫ్లాప్ పెంకులు, అడవి పందులు, చెవుల పిల్లి, కుందేలు, బూడిద రంగు ముంగిస, ముళ్లపందులు, మానిటర్ బల్లులు, కొండశిలువ, బోవా పాములు, నాగుపాము, రస్సెల్స్ వైపర్ , కట్లపాము వంటివి ఉన్నాయి.

## రెండు వందల కోట్ల ఏళ్లనాటి శిల..

సొసైటీ టు సేవ్ రాక్స్ కార్యదర్శి ఫ్రాక్ క్వాడర్ వాదన ప్రకారం.. హైదరాబాద్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పుట్టగొడుగుల శిల నిర్మాణం, కనీసం 200 కోట్ల సంవత్సరాల నాటిది. ఈ శిల భూమి పొర నుండి ఏర్పడిందని ఫ్రాక్ చెప్పారు. "ఇది హైదరాబాద్‌లోని ప్రత్యేకమైన శిల నిర్మాణాల్లో ఒకటి. పుట్టగొడుగుల శిలలను రక్షించి, ప్రకృతి దృశ్యాలు తీర్చిదిద్దుతామని టీజీ హెచ్ సీ తెలియజేసింది" అని ఆమె వివరించారు. ఈ శిల చుట్టూ ఉన్న ఏదైనా నిర్మాణ కార్యకలాపాలు పురాతన నిర్మాణానికి ముప్పుగా మారవచ్చు. నిర్మాణాలతో పెద్ద ఎత్తున కంపనాలతో శిల చెదిరిపోయే అవకాశం ఉంది. పుట్టగొడుగుల శిల చుట్టూ ఎటువంటి నిర్మాణ కార్యకలాపాలు జరగకుండా చూసుకోవాలి" అని ఆమె స్పష్టం చేశారు.

## కట్టడాలతో పెను ప్రమాదమే..

చికాగో నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీ పరిశోధన సహచరుడిగా పనిచేస్తున్న పూర్వ విద్యార్థి వ్యవస్థాపకుడు వైల్డ్‌లెన్స్ డాక్టర్ రవి జిల్లాపల్లి, ఈ భూమిలో ఏదైనా కార్యకలాపాలు కాలుష్యాన్ని పెంచుతాయని అన్నారు. ఫ్లెమింగోలు , వెర్డిటర్ ఫ్లైక్యాచర్ వంటి వన్యప్రాణుల వలస పక్షులను ప్రభావితం చేస్తాయని వాదిస్తున్నారు. ఇది విశ్వవిద్యాలయం మొత్తం గొప్ప జీవవైవిధ్యాన్ని నాశనం చేస్తుందన్నారు.

# కంచె గచ్చిబౌలిలోని భూములను వేలం వేయడం కుదరదు

-గచ్చిబౌలి భూముల అమ్మకం నిర్ణయాల్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్

హైదరాబాద్ ఏప్రిల్ 1 (ఏక ప్రెస్ న్యూస్ );: కంచె గచ్చిబౌలి భూములపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు. కంచె గచ్చిబౌలిలోని భూమికి సంబంధించి హైకోర్టులో కేసు నడుస్తోందని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. విషయం తెలిసి ప్రభుత్వం కోర్టు ధిక్కరణకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. హెచ్ సియు సందర్శనకు వెళ్తున్న బిజెపి నేతలను పోలీసులు అరెస్టు చేయడంతో బండి మీడియాతో మాట్లాడారు. కంచె గచ్చిబౌలిలోని భూములను వేలం వేయడం కుదరదన్నారు. కంచె గచ్చిబౌలి భూములపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు. ప్రభుత్వం వేలం వేయాలనున్నకున్న 400 ఎకరాల భూమి అటవీ పరిధిలోనిదని స్పష్టం. బిఆర్ఎస్‌ను మించి కాంగ్రెస్ దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గచ్చిబౌలి భూముల అమ్మకం నిర్ణయాల్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని బండి చురకలంటించారు. అంతకుమందు హెచ్‌సియు సందర్శనకు బయలుదేరిన బిజెపి నేతలను అరెస్టు చేశారు. హైదర్‌గూడ వద్ద ఎంఎల్‌ఏ క్వార్టర్స్ వద్ద బిజెపి ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలను అడ్డగించారు. హెచ్‌సియు సందర్శనకు అనుమతి లేదంటూ వారిని పోలీసులు అరెస్టు చేశారు.

# మాటలు ఘనంగా ఉంటే, చేతలు హీనంగా ఉన్నాయి

-మాటలు కోటలు దాటితే.. అడుగు గడప దాటడం లేదు
-రైతులను ఇంకెన్నిసార్లు మోసం చేస్తారు: రైతు భరోసాపై హరీశ్‌రావు..



హైదరాబాద్ ఏప్రిల్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మరోసారి ఫైరయ్యారు. ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కడం, మాటిచ్చి మోసం చేయడం, నాలుక మడతేయడం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందంటూ మండిపడ్డారు. రైతు భరోసాపై ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ పై తీవ్ర విమర్శలు చేశారు."మార్చి 31 కల్లా రైతు భరోసా డబ్బులు రైతులందరి ఖాతాల్లో వేస్తామని జనవరి 26న గొప్పగా ప్రకటించారు. మొన్నటి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనూ మార్చి 31 నాటికి రైతులందరికీ భరోసా డబ్బులు ఇస్తామని చెప్పారు.

మాటలు ఘనంగా ఉంటే, చేతలు హీనంగా ఉన్నాయి. మాటలు కోటలు దాటితే.. అడుగు గడప దాటడం లేదు. ముఖ్యమంత్రి మాటలు నమ్మి ఉగాది వేళ ఆశగా ఎదురుచూసిన రైతులకు చేదు అనుభవమే ఎదురైంది" అని ఆగ్రహం వ్యక్తం చేశారు."కేసీఆర్.. నాట్ల సమయంలో రైతు బంధు ఇస్తే, రేవంత్ రెడ్డి కోతల సమయం వచ్చినా రైతు భరోసా ఇవ్వడం లేదు. మోసమే తన విధానంగా మార్చుకున్న రేవంత్ రెడ్డి రైతుల్ని అన్ని కోణాల్లో దగా చేస్తున్నడు. రుణమాఫీని దారుణ వంచనగా మార్చిండు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అడుగు ముందుకు పడటం లేదు..డేట్లు మారుతున్నాయి.. డెడ్ లైన్లు మారుతున్నాయి తప్ప.. రైతులకు ఇచ్చిన హామీలు మాత్రం నెరవేరడం లేదు. కెన్నిసార్లు మోసం చేస్తారు రేవంత్‌రెడ్డి.. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు, అసెంబ్లీలో ప్రకటించినట్లు రైతులందరికీ రుణమాఫీ చేసేదాకా, రైతు భరోసా ఇచ్చే దాకా బిఆర్ఎస్ పార్టీ నిన్నూ, నీ కాంగ్రెస్ పార్టీని వెంటాడుతూనే ఉంటుంది. ఎక్కడిక్కడ నిలదీస్తూ, మీ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉంటుంది" అని హరీశ్‌రావు అన్నారు.

# మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోఓ వ్యక్తిని దారుణంగా హత్య

మహబూబాబాద్ ఏప్రిల్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని భజనతండా సమీపంలో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం? దంతాలపల్లి మండల కేంద్రంలోని మహాత్మజ్యోతిబాపూలే పాఠశాలలో పార్థసారిథి అనే వ్యక్తి హెల్త్ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నాడు. భజతండా సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు పార్థసారథిని గొడ్డలితో నరికి చంపారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు భద్రాచలంకు సంబంధించిన వ్యక్తిగా గుర్తించారు.

# ఎన్నికైన ప్రజాప్రతినిధులా.. రియల్ ఎస్టేట్ ఏజెంట్లా..

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కాంగ్రెస్ పై తీవ్ర విమర్శలు

హైదరాబాద్ ఏప్రిల్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: హెచ్ సియూ ఉద్రిక్తత పరిణామాలపై కెటిఆర్ స్పందించారు. అభివృద్ధి, ప్రభుత్వ భూమి అని సమర్థించుకుంటున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కాంగ్రెస్ పై తీవ్ర విమర్శలు చేశారు. పర్యావరణ పరిరక్షణ పేరిట పేదల ఇళ్లు కూల్చారని మండి పడ్డారు. అభివృద్ధి పేరుతో గిరిజన తండాలపైకి వెళ్లారని, జంతువుల ప్రాంతాలకు వెళ్లి సామూహిక హత్య చేస్తున్నారని విమర్శలు గుప్పించారు. ప్రభుత్వమా? బుల్డోజర్ కంపెనీయా? అని కెటిఆర్ ప్రశ్నించారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులా? రియల్ ఎస్టేట్ ఏజెంట్లా? అని ధ్వజమెత్తారు. విధ్వంసం, ఖజానా నింపుకోవడమే కాంగ్రెస్ నాయకుల నినాదమా అని కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కొత్త ఆర్థిక సంవత్సరం తొలి రోజునే కుప్పకూలిన దేశీయ స్టాక్ మార్కెట్లు

ముంబాయ్ ఏప్రిల్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కొత్త ఆర్థిక సంవత్సరం తొలి రోజునే దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. అమెరికా సుంకాల ఆందోళనలతో సెంటిమెంట్ దిబ్బతిన్నది. ఈ క్రమంలో పెద్ద ఎత్తున మార్కెట్లు పతనమవుతున్నాయి. ఈద్ సందర్భంగా సోమవారం మార్కెట్లు పని చేయని విషయం తెలిసిందే. మంగళవారం మార్కెట్లు నష్టాలతోనే మొదలయ్యాయి. ప్రారంభంలోనే సెన్సెక్స్ 639.13 పాయింట్లు తగ్గి.. 76,775.79 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ సైతం 180.25 పాయింట్లు తగ్గి 23,339.10 పాయింట్లకు చేరింది. ప్రస్తుతం సెన్సెక్స్ 1265.12 పాయింట్లు తగ్గి.. 76149.80 పాయింట్ల వద్ద ట్రేడవుతున్నది. ఇక నిఫ్టీ 322.65 పాయింట్లు తగ్గి.. 23,196.70 పాయింట్ల వద్ద కొనసాగుతున్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతికార టారిఫ్‌లపై బుధవారం తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉన్నది. ఈ క్రమంలో మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.అదే సమయంలో ఇన్ఫోసిస్, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్ సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మారుతీ సుజుకీ షేర్ల అమ్మకాలతో మార్కెట్‌పై మరింత ఒత్తిడి పెరిగింది. ఇక చమురు ధర పెరగడం కూడా ఓ కారణం. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 1.51 శాతం పెరిగి 74.74 డాలర్లకు చేరుకుంది. భారత్ చమురు దిగుమతులపై ఆధారపతుండడగా.. చమురు ధరల పెరుగుదల మార్కెట్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దానికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. శుక్రవారం రూ.4352.82 కోట్ల విలువ షేర్లను విక్రయించారు. ఇక ట్రంప్ సుంకాల కారణంగా అమెరికాలో ఆర్థిక మాంద్యం ప్రభావం పడే అవకాశం ఉందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. ఈ క్రమంలో పెట్టుబడిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ప్రస్తుతం మార్కెట్‌లో బజాజ్ ఫైనాన్స్ సర్వీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, హిందాల్కో, హెచ్‌సీఎల్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్ కంపెనీ, శ్రీరామ్ ఫైనాన్స్, టీసీఎస్ నష్టాల్లో కొనసాగుతుండగా.. ఇండస్‌ఇండ్ బ్యాంక్, ట్రెంట్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, సిప్లా, డాక్టర్ రెడ్డీస్, బజాజ్ ఆటో, ఓఎన్‌జీసీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభాల్లో కొనసాగుతున్నాయి.


# యూనివర్సిటీ భూములు అమ్మనివ్వం.. కొననివ్వం-ఎంపీ అరవింద్

నిజామాబాద్, ఏప్రిల్ 1 తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ ముఖ్యమంత్రి అని ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎప్పుడు భూములు అమ్మాలి.. కమిషన్లు మింగాలనీ ఉంటుందన్నారు. కమిషన్ల మీద ఉన్న శ్రద్ధ రాష్ట్ర అభివృద్ధిపై సీఎంకు లేకపాయేననీ ఎద్దేవా చేశారు. హెచ్ సి యూ భూముల జోలికి రావొద్దని, యూని వర్సిటీ భూములు అమ్మనివ్వమని, కొననివ్వమని ఎంపీ చెప్పారు. సీఎం కు రియల్ ఎస్టేట్ తప్ప, ఏదీ చేతకా దని అడ్మినిస్ట్రేషన్ పై, నాలెడ్జిపై కనీస అవగాహన కూడా లేదని మండిపడ్డా రు.

మంగళవారం హైదరాబాదులో ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటెలతో కలిసి ఎంపీ ధర్మపురి అరవింద్ విలేకరులతో మాట్లాడుతూ రేవంత్ జేసీబీలు ఓల్డ్ సిటీలో నడవవు కానీ.. సెంట్రల్ యూనివర్సిటీ పిల్లల మీద నడపడానికి మాత్రం సిద్ధమయ్యావా అని సీఎం రేవంత్ ను ఎంపీ ప్రశ్నించారు. హెచ్ సీ యూ భూములను విక్రయించడం ద్వారా వచ్చే రూ.40వేల కోట్లలో నిజంగా రాహుల్ గాంధీకి కమిషన్ లేకపోతే వెంటనే మీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అడ్డుకోవాలని ఎంపీ రాహుల్ గాంధీకి సూచించారు.

ఈ 2,500 ఎకరాలలో సుమారు 700 పక్షులు ఉన్నాయన్నారు. జేసీబీలతో చెట్లను తొలగించే క్రమంలో జింకలు, నెమళ్లు మృత్యువాత పడుతున్నాయని వాపోయారు. జంతువుల, పక్షుల అర్థనాథాలు ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని ఎంపీ డిమాండ్ చేశారు. అదేవిధంగా 2500 ఎకరాల్లో వర్సిటీ యూనివర్సిటీ భూమి నోటిఫై చేసి శాశ్వత బౌండరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. హెచ్ సీ యూ భూముల జోలికొస్తే ఊరుకోమని హెచ్చరించారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



వరంగల్, ఏప్రిల్ 1 రాష్ట్రంలోని నిరుపేదలందరి సంక్షేమ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తున్నదని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి ఆమె మండల కేంద్రంలోని రేషన్ దుకాణంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీ తో పేదల ఆకలి బాధలు తీర్చడంతోపాటు ఆత్మస్థైర్యం మెరుగవుతుందన్నారు.

అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 21 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని నిరుద్యోగులు అందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, ఎంపీడీవో గుగులోతు కిషన్ నాయక్, డిప్యూటీ తహసిల్దార్ గంకిడి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీఓ కూచన ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి వల్లే వినోద్ కుమార్, నాయకులు జాటోతు హామ్య నాయక్, బిల్ల సుధీర్ రెడ్డి, ఈదులకంటి రవీందర్ రెడ్డి, సరికొండ కృష్ణారెడ్డి, పెండ్లి మహేందర్ రెడ్డి, ఊగ మునిత, కాంచనపల్లి వనజా రాణి, ఇల్లందుల భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసి ఉన్న ఇండ్లే లక్ష్యం.. రెండు తులాల బంగారం, బైక్‌ను ఎత్తుకెళ్లిన దుండగులు

హైదరాబాద్, ఏప్రిల్ 1: తాళం వేసి ఉన్న ఇండ్లే లక్ష్యంగా దుండగులు చోరీలకు పాల్పడ్డారు.సిద్ధార్థ నగర్‌లో దొంగలు తాళం పగలగొట్టి రెండు తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్ధార్థ నగర్ చెందిన ఎస్తేరు అనే మహిళ ఆదివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి సమీపంలోని కూతురింటికి వెళ్లింది. సోమవారం రాత్రి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి బీరువాను తెరిచి చేసే సరికి అందులో వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉన్నట్లు తెలిపారు.

బీరువాలోని రెండు తులాల బంగారం వస్తువులను ఎత్తుకు పోయారని బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. అదే కాలనీలో వెంకటరమణ అనే వ్యక్తికి చెందిన బైకును గుర్తు తెలియ వ్యక్తులు ఎత్తుకు పోయారు. బాధితుడు సోమవారం రాత్రి కాజీపేట పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

